ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

తుంగభద్ర గేట్లన్నీ మార్చాల్సిందే



19వ క్రస్ట్ గేట్‌కు ఏర్పాటు చేస్తున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ (ఫైల్)

- వాటి జీవితకాలం ఎప్పుడో తీరిపోయింది
- నిర్లక్ష్యం చేస్తే కొట్టుకుపోయే ప్రమాదం
- తుంగభద్ర బోర్డుకు 'కేఎస్ఎన్‌డీటీ' నివేదిక
- ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలకు, సీడబ్ల్యూసీకి నివేదించిన టీబీపీ బోర్డు అధికారులు

'తుంగభద్ర డ్యాం 33 క్రస్ట్ గేట్ల జీవితకాలం ఎప్పుడో తీరిపోయింది. మెజార్టీ గేట్లు 60 శాతం, మిగిలిన గేట్లు 40-50 శాతం వరకు చివరి భాగంలో తుప్పుపట్టాయి. అన్ని గేట్లనూ మార్చాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే గత ఏడాది తరహాలో ఎప్పుడైనా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది' అని డ్యాం గేట్ల పటిష్ఠతపై సమగ్ర పరిశీలన చేపట్టిన చీరాలకు చెందిన అధ్యయన సంస్థ కేఎస్ఎన్‌డీటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు సమగ్ర వివరాలతో టీబీపీ బోర్డుకు నివేదిక ఇచ్చింది. ఈ రిపోర్టుతో పాటు గతంలో సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా తుంగభద్ర బోర్డు అధికారులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలకు, సీడబ్ల్యూసీకి ఒక నివేదిక పంపారు. మొత్తం క్రస్ట్ గేట్లను మార్చాలంటే ఒక్కోదానికి రూ.2 కోట్ల చొప్పున దాదాపు రూ.60-66 కోట్ల మేర నిధులు అవసరమవుతాయి. అయితే పాత గేట్లను విక్రయించడం ద్వారా రూ.10 కోట్లు వస్తాయని అంచనా. అన్ని గేట్లు మారుస్తారా? ఒక్క గేటుతో సరిపుచ్చుతారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం గత ఏడాది ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. - కర్నూలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి)

మూడు రాష్ట్రాలకు ప్రయోజనకారి

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాల జీవనాడిగా తుంగభద్ర జలాశయం ఉంది. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాలకు తుంగభద్ర డ్యాం నుంచి టీబీపీ ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, కేసీ కాలువల ద్వారా 66.50 టీఎంసీల నీటి వాటా ఉంది. ఖరీఫ్, రబీలో దాదాపు 7లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు, ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో మెజార్టీ గ్రామాలకు తాగునీరు అందించే ప్రధాన నీటి వనరు ఈ ప్రాజెక్టు. 1953 నుంచి ఆయా రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాలు కాపాడుతున్న తుంగభద్ర డ్యాం ప్రస్తుతం ప్రమాదంలో పడింది. 2024 ఆగస్టులో వరద ఉధృతికి 19వ నంబరు క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు సారథ్యంలో దాని స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేశారు. వరద కడలిపాలు కాకుండా ఆపగలిగారు. అయితే మిగిలిన గేట్లు భద్రమేనా? అన్నది ప్రశ్నార్థకం. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ డ్యాం, గేట్లను సమగ్రంగా తనిఖీ చేసింది. గేట్ల జీవిత కాలం తీరిపోవడం వల్ల మరమ్మతులతో కాలయాపన చేయకుండా.. 33 గేట్లను మార్చాలని, గేట్ల ఏర్పాటులో అనుభవం కలిగిన సంస్థతో అధ్యయనం చేయించాలని సూచిస్తూ నివేదిక ఇచ్చింది.

క్రస్ట్ గేట్ జీవిత కాలం 42 ఏళ్లే

బజాజ్ కమిటీ సూచన మేరకు బోర్డు అధికారులు టెండర్ల ద్వారా ఎంపిక చేసిన బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ క్షేత్రస్థాయిలో డ్యాంను తనిఖీ చేసింది. 19వ గేటు మినహా.. మిగిలిన 32 క్రస్ట్ గేట్లకు 'కాంప్రెహెన్సివ్ హెల్త్ చెకప్' నిర్వహించారు. అల్ట్రాసోనిక్ స్కానింగ్ ద్వారా గేట్ల పటిష్ఠతను పరిశీలించారు. ఒక్కో గేటు వారీగా ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదికను కేఎస్ఎన్‌డీటీ టీబీపీ బోర్డుకు ఇచ్చింది. వాస్తవానికి క్రస్ట్ గేట్ల జీవిత కాలం 42 ఏళ్లే. అయితే తుంగభద్ర డ్యాం గేట్లు ఏర్పాటు చేసి 72 ఏళ్లకు పైగా అయింది. ఈ నేపథ్యంలో 33 గేట్లు మార్చాల్సిందేనని అధ్యయన సంస్థ అభిప్రాయపడింది.

19వ గేటు మార్చేందుకు సన్నాహాలు

ప్రస్తుతం గతేడాది కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో కొత్తదాని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రూ.1.98 కోట్లతో టీబీపీ బోర్డు అధికారులు టెండర్లు నిర్వహించారు. గుజరాత్‌కు చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ 3.60 శాతం ఎక్కువ ధరకు టెండరు దక్కించుకుంది. ఇదొక్కటే ఆన్‌లైన్ టెండరు వేసింది. ఈ సంస్థకు పశ్చిమ బెంగాల్‌లోని పరాకా బ్యారేజ్ గేట్లు ఏర్పాటు చేసిన అనుభవం ఉందని ఇంజనీర్లు తెలిపారు. 'హార్డ్‌వేర్ టూల్స్' ఇంజనీర్లు ఈనెల 21న తుంగభద్ర డ్యాం, 19వ గేటును పరిశీలిం చారు. పనులు ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో సన్నాహాలు చేపట్టారని తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ్ నాయక్ తెలిపారు. జూన్ ఆఖరులోగా నూతన గేటు అమర్చాలని అధికారులు గడువు విధించారు.



స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు తర్వాత ఆగిన నీటి ప్రవాహం (ఫైల్)

హెచ్‌టీ బీటీ విత్తనాలపై అప్రమత్తం

- ఈ రకం విత్తనాలతో పర్యావరణానికి ప్రమాదం
- రైతులకు అందకుండా ముమ్మర తనిఖీలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.60 లక్షల హెక్టార్లలో సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగవుతోంది. వచ్చే ఖరీఫ్‌లో రైతులు భారీగా పత్తి సాగుకు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా. ఇందులో భాగంగా రైతులు పర్యావరణానికి పెనుముప్పు కలిగించనున్న హెచ్‌టీ కలిగిన బీటీ పత్తి విత్తనాలు వినియోగించకుండా చర్యలు తీసుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో అప్రమత్తమయింది. హెచ్‌టీ పత్తి విత్తనాల ఉత్పత్తి, సాగు, అమ్మకాలను కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే నిషేధించింది. వీటి సాగు వల్ల పర్యావరణానికి హానీ కలుగుతుందని, నేల విషతుల్యమైపోతుందని గుర్తించి ఈ విత్తనాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ విత్తనాల తయారీ సమయంలోనే అడ్డుకట్ట వేస్తే రైతులకు సరపరా కాకుండా నియంత్రించవచ్చనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఏడీఏ ఏవో స్థాయి అధికారులు వచ్చారు. ప్రస్తుతం వీరు కర్నూలు జిల్లాలో పత్తి విత్తనాల నమూనాలు సేకరిస్తున్నారు. వీరికి ఆయా మండలాల్లో ఉన్న మండల వ్యవసాయాధికారులు సహకారాలు అందిస్తున్నారు. వీరంతా బృందాలుగా ఏర్పడి కర్నూలు, నంద్యాల, ఆదోని ఎమ్మిగనూరు, కోడుమూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న పత్తి విత్తనాల జిన్నింగ్ ప్యాక్టరీలు విత్తనాలు పంపిణీ చేసే కంపెనీల గోదాములు, హోల్‌సేల్, రీటైల్ డీలర్ల షాపులు, అదే విధంగా పార్సిల్, రవాణా కార్యాలయాల్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. అక్కడికక్కడ నమూనాలు సేకరించి హెర్బిసైడ్ ట్రైట్ జెన్యూ పరీక్షలు చేసి ఆ పత్తి విత్తనాల్లో హెట్ జెన్యూ ఉందా లేదా అని నిర్ధారిస్తున్నారు. ఇప్పటి దాకా పరీక్షించిన విత్తనాల్లో హెచ్‌టీ పత్తి విత్తనాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.



హెట్ టీ పత్తి విత్తనాలు ఇవే

కలుపు నివారణ ఖర్చులు తగ్గుతాయని..

నేలలో, పరిసరాల్లో తీవ్ర దుష్ఫలితాలు కలిగించే హెచ్‌టీ కలిగిన బీటీ పత్తి విత్తనాలను 2019లో ఉమ్మడి జిల్లాలో రైతులు వినియోగించారు. ఈ హెచ్‌టీ పత్తి విత్తనాలను సాగు చేస్తే పొలంలో కలుపు నివారణ మందులు చల్లాల్సిన అవసరం ఉండదని, దీని వల్ల కూలీల ఖర్చు తగ్గిపోతుందని రైతులు అనుకున్నారు. ఈ రకమైన ప్రచారం జరగడంతో రైతులు నిజమే అని నమ్మారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హెచ్‌టీ పత్తి విత్తనాల సాగు వల్ల పర్యావరణ పరంగా అనేక సమస్యలు వస్తున్నట్లు గుర్తించి హెచ్‌టీ పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను సాగు చేపట్టకుండా ఈ విత్తనాలపై నిషేధం విధించింది. అయితే కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికీ కలుపు సమస్య తగ్గుతుందనే ఆలోచనతో హెచ్‌టీ పత్తి విత్తనాలను సాగుకు ఉపయోగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఖరీఫ్ సీజన్ మే నెలాఖరులో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో హెచ్‌టీ పత్తి విత్తనాలను సాధ్యమైనంత తొందరగా స్వాధీనం చేసుకుని రైతులకు అందకుండా చేసేందు కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

సివిల్స్‌లో మెరిసిన కర్నూలు వాసి

- పవన్‌కుమార్ రెడ్డికి 375వ ర్యాంకు
- అమ్మానాన్నలు ఇద్దరూ ఉపాధ్యాయులే
- ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ
- రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌లో ర్యాంకు



పవన్‌కుమార్‌రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి చెందిన పవన్ కుమార్‌రెడ్డి మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 375వ ర్యాంకు సాధించారు. వైద్యవృత్తిలో స్థిరపడాలని భావించి కర్నూలు మెడికల్ కళాశాలలో మెడిసిన్ కూడా పూర్తి చేశారు. దేశానికి, ప్రజలకు సేవలు అందించాలనే తపనతో పవన్‌కుమార్‌రెడ్డి సివిల్స్‌పై దృష్టి పెట్టారు. అమ్మానాన్నల స్ఫూర్తితో 2020-22 సంవత్సరంలో ఢిల్లీలో సివిల్ కోచింగ్ సెంటర్‌లో చేరారు. 2023 సివిల్స్ ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే. పవన్‌కుమార్‌రెడ్డి ఇం టర్వ్యూ వరకు వెళ్లారు. సివిల్స్‌కు ఎంపిక కాలేదని నిరుత్సాహం చెందక రెట్టింపు ఉత్సాహంతో మళ్లీ ఢిల్లీలో కోచింగ్ సెంటరులో సివిల్స్‌లో శిక్షణ తీసుకుంటూ వచ్చారు.2024 సివిల్స్ ఫలితాల్లో ఆయన 375వ ర్యాంకును సాధించారు. కర్నూలు నగరంలోని సంకల్‌బాగ్‌కు చెందిన ఎం.కృష్ణారెడ్డి, మధుమతి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి. అమ్మానాన్నలు ఇద్దరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. కర్నూలు మండలం పంచలింగాలలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ హెచ్ఎంగా కృష్ణారెడ్డి పనిచేస్తున్నారు. కల్లూరు మండలంలోని ఆర్.కొంతలపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా మధుమతి పనిచేస్తున్నారు. పవన్‌కుమార్ రెడ్డి ప్రాథ మిక విద్య నుంచి హై స్కూల్, మెడిసిన్ స్థాయి వరకు కర్నూలులోనే విద్య కొనసాగింది. 1నుంచి 5వ తరగతి వరకు వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలోనూ, ఎస్ఆర్‌పేట శ్రీలక్ష్మి పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు, భాస్కర్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో 9, 10 తరగతి వరకువిద్యను అభ్యసించారు. అనంతరం గుంటూరులోని భాష్యం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో బైపీసీ గ్రూపులో చేరారు. ఇంటర్ పరీక్షలో 975/1000 మార్కులు సాధించారు. 2016లో జరిగిన ఎంసెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో పవన్ కుమార్ రెడ్డి 6వేల ర్యాంకు సాధించికర్నూలు మెడికల్ కాలేజీలో మెడిసిన్‌లో చేరారు. 2021-22లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు.సివిల్స్‌లో ర్యాంకు రావడంపైతల్లిదండ్రులు కృష్ణారెడ్డి, మధుమతి ఆనందాన్ని వ్యక్తంచేశారు.

రోజుకు 18 గంటలు కష్టపడ్డా

రెండో ప్రయత్నంలో సివిల్స్‌లో సివిల్స్‌లో 375వ ర్యాంకు సాధించా. మెడికల్ సైన్స్‌ను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నా. రోజుకు 18 గంటల పాటు కష్టపడ్డా. ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. -పవన్‌కుమార్‌రెడ్డి



పవన్‌కుమార్ రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

భానుడి భగభగలు

- రోజుకు రోజుకూ పెరుగుతున్న ఎండలు
- ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- ఆళ్లగడ్డలో 43.76, కోసిగి మండలంలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కర్నూలు జిల్లాల్లో మంగళవారం 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఆళ్లగడ్డలో 43.76 డిగ్రీల ఉష్ణోగ్రత, కోసిగి మండలం సాతనూరులో 43.5, పాణ్యం మండలం గోనవరంలో 43.34, మంత్రాలయం మండలం వగరూరులో 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కల్లూరు మండలం ఉలిందకొండలో 42.93, గోస్పాడులో 42.83, పాములపాడులో 42.75, బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలో 42.7, కర్నూలు నగరంలో 42.7, కోడుమూరు మండలం లద్దగిరిలో 42.59 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది. సంజామల మండలం పేరుసోములలో 42.56, శిరివెళ్లలో 42.44, బనగానపల్లె మండలం యాగంటిలో 42.4, దొర్నిపాడులో 42.4, బనగానపల్లె మండలం పాతపాడులో 42.37, పసుపులలో 42.3, కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తిలో 42.26, గడివేములలో 42.09, బనగానపల్లెలో 42.04 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే డోన్‌లో 42.03, జూపాడుబంగ్లాలో 42.01, నంద్యాల పట్టంలో 42.0, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 41.97, ఓర్వకల్లులో 41.20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

వేసవిలో ముమ్మరంగా ఉపాధి కల్పించాలి

- జూన్‌లోపు పంట కుంటల నిర్మాణాలు పూర్తి కావాలి
- ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ముమ్మరంగా ఉపాధి పనులు కల్పించాలని, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే 90 శాతం లక్ష్యాలను సాధించే విధంగా పనులు కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం ఉపాధి హామీ, హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయాలు సర్వీసెస్ అంశాలపై జిల్లా అధికారులు మండల స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడుమూరు, ఓర్వకల్లు, దేవనకొండ, చిప్పగిరి మండలాలు రోజువారి లక్ష్యంలో భాగంగా మంగళవారం కేవలం 60 శాతం మందికి మాత్రమే పనులు కల్పించారని ఎంపీడీవోలను ప్రశ్నించారు. ఏప్రిల్ నెలలో ఇప్పటి వరకు పని దినాలు కల్పించడంలో భాగంగా మద్దికెర మండలంలో 21 శాతం లక్ష్యం సాధిస్తే, నందవరం గోనెగండ్ల, హాలహర్వి, ఆస్పరి మండలాలు 7 శాతం లోపు లక్ష్యాలు మాత్రమే సాధించడం ఏమిటని ఆయా మండలాల ఎంపీడీవోలను ప్రశ్నించారు. జూన్‌లోపు పంటకుంటలు నిర్మించాలని, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన పత్తి ధర

- క్వింటం గరిష్ఠంగా రూ. 8,254

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకూ పైకి ఎగబాకుతున్నాయి. రెండో రోజు పత్తి ధర క్వింటానికి రూ.150పైగా పెరిగింది. మంగళవారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.8254 పలికింది. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధపడుతున్న సమయంలో పత్తి ధరలు పెరగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పత్తి జిన్నింగ్ ప్రెస్సింగ్ పరిశ్రమలకు ఉత్పత్తికి తగ్గ పత్తి మార్కెట్‌కు విక్రయానికి రాకపోవడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లోని దూది ధరలు, గింజల ధరలు స్వల్పంగా పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. 657 క్వింటాల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.5209, గరిష్ఠ ధర రూ.8254, మధ్యస్థ ధర రూ.7639 పలికింది.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.06 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4,05,95,395 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. మంగళవారం 32 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించారు. రూ.4,05,95,395 నగదుతో పాటు 1.495 కేజీల వెండి, 116 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమచేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవికులకర్ణి, కృష్ణమూర్తి, గోపి, కరణం రాఘవేంద్ర, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ తదితరులు పాల్గొన్నారు.


రుద్రవరంలో పసుపు కొమ్ములను నెరుపుతున్న కూలీలు

పసుపు డీలా...!

- తగ్గిన పసుపు ధర
- క్వింటంపై రూ.5వేలు పతనం
- జిల్లాలో 1500 ఎకరాల్లో సాగు

రుద్రవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకొని మట్టి మనిషి పసుపు సాగుచేశారు. ఏడాదిపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పసుపు చేతికి వచ్చేసరికి దిగుబడి తగ్గింది. మార్కెట్లో రేటూ తగ్గింది. ఒక్కో ఎకరాకు రూ.2లక్షల మేర పెట్టుబడి పెట్టిన రైతులు ధర తగ్గుముఖం పట్టడంతో ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1500ఎకరాల్లో పసుపు విస్తారంగా సాగు అవుతోంది. రుద్రవరం మండలం ఆలమూరు, చిత్తరేణిపల్లె, రుద్రవరం, నాగులవరం, రెడ్డిపల్లె తదితర గ్రామాల్లో రైతులు పసుపు పంటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గత ఏడాది 2024 జూన్ మాసంలో పసుపు సాగుచేశారు. పసుపు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఎకరాకు వెయ్యి కేజీల విత్తనం వినియోగించినట్లు రైతులు తెలిపారు. సుమారు పసుపు దిగుబడి 60 నుంచి 70 పుట్లు దాకా సగటున దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. మైదుకూరు పసుపు రకం ఒకటి, మరో రకం సాగు చేశారు. గత ఏడాది మార్కెట్లో పసుపు కొమ్ముల క్వింటం రూ.16వేలు రేటు పలికింది. పసుపు దుంపలు పుట్టి (250 కేజీలు) రూ.8,500 రేటు పలికింది. 2024లో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మంచి లాభాలు, మంచి దిగుబడి వచ్చిందని అన్నారు. కానీ ప్రస్తుతం మార్కె ట్‌లో ధర అమాంతంగా పడిపోయింది. మార్కెట్‌లో పసుపు కొమ్ములు క్వింటం రూ.10వేలు నుంచి రూ.11 వేలు రేటు పలుకుతోంది. పసుపు దుంపలు పుట్టి (250 కేజీలు) రూ.3500 రేటు పలుకుతోంది. పసుపు కొమ్ములపై క్వింటా రూ.5వేలు, పసుపు దుంపలు పుట్టిపై రూ.5వేలు రేటు తగ్గిందని రైతులు ఆందోళన పడుతున్నారు. ఎంతో ఆశతో సాగు చేస్తే పసుపు పంట నిరాశ మిగిల్చిందని వాపోయారు.


పసుపు కుప్పలు



పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



పసుపు సాగులో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టాం. దిగుబడి కూడా తగ్గింది. మార్కెట్లో ధర తగ్గింది. ధర కోసం ఎదురు చూస్తున్నాం. ఆరు ఎకరాల్లోసాగు చేసి రూ.12 లక్షలు పెట్టుబడి పెట్టా.

- సుబ్బరాయుడు, రైతు, రుద్రవరం

ధర తగ్గింది



పసుపు దిగుబడికి మార్కెట్లో ధర తగ్గింది. గత ఏడాది ఒట్టి పసుపు క్వింటా రూ.16వేలు రేటు పలికింది. ప్రస్తుతం క్వింటా ఒట్టి పసుపు రూ.10 నుంచి రూ.11 వేలు రేటు పలుకుతోంది. పచ్చి పసుపు పుట్టి (250కేజీలు) గత ఏడాది రూ.8,500 రేటు పలికింది. ప్రస్తుతం పుట్టి పచ్చి పసుపు రూ.3,500 రేటు పలుకుతోంది.

-శ్రీనివాసులు, రైతు, రుద్రవరం

పసుపు కొనుగోలుపై ఆదేశాలు లేవు



మార్కెటింగ్ శాఖకు పసుపు కొనుగోలు చేయడానికి ఆదేశాలు ఇంకా ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే మార్కెటింగ్ శాఖ పసుపు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటుంది. పసుపు రకాల సాగు మార్చాలని రైతులకు సూచించేందుకు సభలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సభలు ఏర్పాటు చేస్తాం.

- నాగరాజు, జిల్లా ఉద్యాన అధికారి, నంద్యాల

పసుపును ఉడకబెడుతున్న దృశ్యం



ప్రిన్సిపాల్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న రాయపాటి శ్రీనివాసులు, మహబూబ్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్‌కు సేవారంగంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపునకు గానూ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం నేషనల్ ఉమెన్స్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఏపీ క్యాంపులోని సీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లైఫ్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంటు రాయపాటి శ్రీనివాసులు, డీఎస్పీ మహబూబ్‌బాషా, పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి కలిసి నాగస్వామి నాయక్‌కు అవార్డు అందజేశారు. ఈసందర్భంగా ఆయనను శాలువా కప్పి జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకుల, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల (మేల్)కు పని సర్దుబాటు

45 మందితో సీనియారిటీ జాబితాను విడుదల చేసిన డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ-మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులు సీనియార్టీ జాబితాను 46 మందితో విడుదల చేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో జిల్లా మలేరియా కార్యాలయంలో తెలియజేయాలని డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీ చేశారు. అభ్యంతరాల తర్వాత కౌన్సిలింగ్ తేదీని ప్రకటించి ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నారు. ఇక నంద్యాల జిల్లాలో హెల్త్ అసిస్టెంట్లు (మేల్) ఉద్యోగుల సర్దుబాటు కౌన్సిలింగ్ బుధవారం నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరగనుంది.

టీటీడీ నిధులతో కల్యాణ మండపాలు

- ఏఈఈ లక్ష్మీపతి

మహానంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):, నంద్యాల జిల్లాలో రూ.12.60 కోట్లతో కల్యాణ మండపాల నిర్మాణాలు జరుగుతున్నట్లు టీడీడీ ఏఈఈ ఎం.లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం సాయంత్రం మహానంది క్షేత్ర పరిసరాల్లో నిర్మాణం పూర్తయిన డార్మెటరీని ఏఈఈ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానందిలో రూ.1.60 కోట్ల టీటీడీ నిధులతో డార్మెంటరీ నిర్మాణం పూర్తి దశకు వచ్చిందన్నారు. టీటీడీ నిధులతో నంద్యాల పట్టణంలో అత్యాధునికంగా నిర్మిస్తున్నకల్యాణ మంటపం కూడ పూర్తి దశకు వచ్చిందని చెప్పారు.

జూనియర్ సివిల్ న్యాయాధికారుల బదిలీ

కర్నూలు లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జూనియర్ సివిల్ న్యాయాధికారులు బదిలీ అయ్యారు. కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.జ్యోత్స్నదేవి ఖాళీగా ఉన్న పత్తికొండకు బదిలీ అయ్యారు. కర్నూలు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.వందన కృష్ణా జిల్లా నందిగామ అదనపు జూనియర్ న్యాయాధికారిగా, ఖాళీగా ఉన్న బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయా. దికారిగా అనంతపురం జిల్లా కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఎస్. ప్రతిమ బదిలీ అయ్యారు. కర్నూలు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.కళ్యాణి బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ కాగా ఆ స్థానంలో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మేజిస్ట్రేట్ ఎస్.అనూష వచ్చారు. కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం. సరోజనమ్మ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఆమె స్థానంలో సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న ఎస్. అనిల్‌కుమార్ బదిలీ అయ్యారు. కోవెలకుంట్ల జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న అబ్దుల్ రెహిమాన్ షేక్ నెల్లూరు మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా నెల్లూరులో నాల్గవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న టి. భాస్కర్ బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఎంతః వెంకట ప్రసాద్ కడప రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పి.రాహుల్ అంబేడ్కర్ ఆత్మకూరు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా బదిలీ అయ్యారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

తెలుగు నాటక రంగానికి జీవం పోస్తాం

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకరంగానికి జీవం పోస్తామని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ వజ్రోత్సవ జన్మదిన సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తర్వాత గుమ్మడి గోపాలకృష్ణ చంద్రబాబు నాయుడుపై రాసిన 'పుడతారు ఎందరో మహానుభావులు..' అనే పాటతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 100 రోజుల సాంస్కృతిక ప్రదర్శనలకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గుమ్మడి గోపాలకృష్ణ అంతర్జాతీయ నటుడిగా నాటకరంగ పురోభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ కమలపాలికలో నటించిన కళాకారులు కే బాలవెంకటేశ్వర్లు, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, పి. రాజారత్నం, చిదంబరరెడ్డి, సురభి ప్రభావతి, ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న ఎమ్ఆర్ రాధిక, మంజులను ఆయన సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అసాంతం ఆకట్టుకుంది.

నేడు 'తరమెల్లిపోతున్నదో' సాంఘిక నాటకం

టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం నాలుగో రోజు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ ఆర్ట్స్ సంస్థ వారు 'తరమెల్లిపోతున్నదో' సాంఘిక నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు.

గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారాలు ..

ఏపీ నాటక అకాడమీకి రెండోసారి చైర్మన్‌గా నియమితుడైన గోపాలకృష్ణను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తన కార్యాలయంలో సత్కరించారు. మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వ్యాపారవేత్త ఇల్లూరి లక్ష్మయ్య హోటల్ త్రిగుణక్లార్క్‌లో సన్మానించారు.


గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, రంగస్థల కళాకారులు.,



అంతటా ఆహార కల్తీ

జిల్లాలో ఆహార కల్తీ ప్రజారోగ్యానికి పెను సవాల్‌గా మారింది. నగరంలో ఈ సమస్య మరింత పెచ్చుమీరుతోంది. చట్టాల అమలులో ఉదాసీనత, అధికార యంత్రాంగం అలసత్వం, సిబ్బంది కొరత మొదలైనవి కల్తీరాయుళ్లకు బాగా కలిసి వచ్చింది. ఫలితంగా ప్రతి ఏటా కల్తీ ఆహార బాధితుల సంఖ్య వేలల్లో పెరిగిపోతోంది. ఆధునిక వసతులు, ప్రమాణాలతో కూడిన పరీక్ష కేంద్రాలు స్థానికంగా అందుబాటులో లేకపోవటం కూడా ఆహార కల్తీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.

- తూతూ మంత్రంగా తనిఖీలు
- నామమాత్రపు జరిమానాలు, శిక్షలు
- వేధిస్తోన్న సిబ్బంది కొరత
- బాధ్యత, భయం లేని వ్యాపారులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిత్యం ఏదో ఒక మూలాన ఆహార కల్తీ కేసులు వెలుగు చూస్తునే ఉన్నాయి. నిత్యావసరాల మొదలు తినుబండారాల వరకు విడి పదార్థాలు నుంచి ప్యాకేజ్డ్ వస్తువుల వరకు అన్నీ కల్తీమయంగా మారాయి. వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కారంలో రంపపు పొట్టు, పిండిలో నాణ్యత లేని పదార్థాలు, నిషేధిత రసాయనాలను వాడి పండ్లను మాగపెట్టడం, కృత్రిమ రంగులతో ఆహార పదార్థాలను ఆకర్షణీయంగా తయారు చేయటం, వంట నూనెల్లో నిషేధిత జంతు కొవ్వులు వినియోగించటం, ఫ్రిజ్‌లో దీర్ఘకాలం నిల్వ ఉంచిన పదార్థాలను వాడటం మొదలైనవి ప్రజారోగ్యానికి శాపంగా మారాయి. ఇటీవలి కాలంలో ఆహార కల్తీ నియంత్రణ అధికారుల తనిఖీల్లో విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. హాలహర్విలో నెయ్యిని కల్తీ చేస్తూ ఓవ్యక్తి పట్టుబడ్డాడు. గూడూరులో నాణ్యతలేని బెల్లం విక్రయిస్తూ మరో వ్యాపారి అధికారులకు చిక్కాడు. నగరంలోని ఒక హోటళ్లలో తినడానికి యోగ్యత లేని చికెన్ ధమ్ బిర్యానీ, నాణ్యత లేని పెరుగు అమ్ముతూ నిర్వాహకులు దొరికిపోయి జరిమానా చెల్లించారు.



అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయం

ఆహార కల్తీ నియంత్రణ అధికారులు సాధారణ తనిఖీలతో సరిపుచ్చుతున్నారే తప్ప, భారీ జరిమానాలు, కఠిన శిక్షలు విధించకపోవటంతో కల్తీరాయుళ్లలో భయం, బాధ్యత లేకుండా పోయింది. తరచూ తనిఖీలతో పాటు ఆకస్మిక దాడులు నిర్వహించాల్సిన సిబ్బంది తమ లక్ష్యానికి అనుగుణంగా నామమాత్రంగా చర్యలు చేపట్టి మమ అనిపిస్తున్నారనే అపవాదు మూట కట్టుకున్నారు. ఏడాది కాలంలో యంత్రాంగం 570 నమూనాలను సేకరించగా అందులో కేవలం 242 మందిపైనే కేసులు నమోదు చేశారు. ఇందులో 21 హానికరమైనవిగా, మరో 23 నాణ్యత లేని ఆహారంగా గుర్తించటం గమనార్హం. వీరి నుంచి రూ.2.20 లక్షల జరిమానా వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఆహార కల్తీకి పాల్పడితే 6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చని చట్టం చెబుతోంది. కానీ ఇవి ఏవీ అమలుకు నోచుకోవటం లేదు. కల్తీకి పాల్పడుతూ ఎవరైనా దొరికితే సాదాసీదా జరిమానాలతో సరిపుచ్చటం తప్ప, జైలు శిక్ష వంటి కఠిన శిక్షల అమలుకు నోచుకోవటం లేదు. ఇప్పటి వరకు వ్యాపారికి జైలు శిక్ష పడిన సందర్భాలు అధికార వర్గాలకే గుర్తు లేదంటే అతిశయోక్తి కాదు. చాలా వరకు కేసులు ఎటూ తేలకుండా కోర్టుల్లో ఉండటం, వాటికి దీర్ఘకాలం సమయం వెచ్చించాల్సి రావటం కూడా కల్తీరాయుళ్లకు కలిసి వస్తోంది.

సిబ్బంది కొరత: ఆహార కల్తీ నిరోధానికి ప్రధానంగా శాఖాపరంగా సిబ్బంది కొరత ఒక సమస్యే అని చెప్పాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నలుగురు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. కానీ ఇద్దరు సహాయ కంట్రోలర్లు అవసరం కాగా ఒకరే విధులు నిర్వర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నమూనాల సేకరణకు కీలకమైన సహాయక సిబ్బంది నలుగురు కావాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. దీని వల్ల నమూనాల సేకరణ, వాటిని పరీక్ష కేంద్రాలకు పంపి, ఫలితాలు రాబట్టడంలో అలస్యం జరుగుతోంది. దీనికి తోడు నమూనాల పరీక్ష కేంద్రం ఏపీలో లేదు. తెలంగాణలోని నాచారంలో ఉంది. ఇది కూడా అధికార యంత్రాంగానికి ప్రతికూలాంశంగా మారింది. వీటితో పాటు క్షేత్రస్థాయి తనిఖీలకు అవసరమైన వాహనాల కొరత కూడా వేధిస్తోంది. సొంత వాహనం ఒకటీ లేకపోవడంతో అత్యవసర సమయాల్లో అద్దె వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. అసలే అరకొర సిబ్బంది, వాహనాలలేమితో అవస్థలు పడుతున్న సంబంధిత యంత్రాంగానికి ప్రముఖుల పర్యటనలు మరింత పనిభారమనే చెప్పాలి. వీఐపీ ప్రొటోకాల్ దృష్ట్యా సమయం మొత్తం అక్కడే గడపాల్సి రావటం కూడా సిబ్బంది రోజువారీ తనిఖీలకు విఘాతం కల్గిస్తోంది.

నిరంతరం తనిఖీ చేస్తున్నాం



లక్ష్యానికి అనుగుణంగా నిరంతరం తనిఖీ చేస్తున్నాం. ఫిర్యాదులు అందితే మరింత తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇప్పటికే తనిఖీల ద్వారా జరిమానాలు వసూలు చేశాం. అదనపు సిబ్బంది అవసరం ఉంది. త్వరలోనే విశాఖపట్నంలో నూతనంగా పరీక్ష కేంద్రం పూర్తి కానుంది. దీని వల్ల నమూనాల సేకరణ, ఫలితాలు రాబట్టం మరింత వేగమవుతుంది. వ్యాపారులు కల్తీకి పాల్పడితే వారి లైసెన్స్ రద్దు చేస్తాం.

- కూర్మ నాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

• రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో ఏపీయూడబ్ల్యూజే సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ఆయనతో పాటు రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బరావు పాల్గొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు ఇవ్వడానికి తనవంతు కృషి చేస్తామన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రమాదబీమా, హెల్త్‌కార్డులు ఇవ్వాలని ఐవీ సుబ్బరావు కోరారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమిస్తూ కలెక్టర్ రంజిత్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కర్నూలు, సెక్రటరీగా కర్నూలు డిస్ట్రిక్ట్ ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎండోమెంటు గ్రూప్-1 ఆఫీసర్స్ (ఎస్సీ-మాల), కర్నూలు డీఎం సివిల్ సప్లయ్ ఆఫీసర్ నాగసుధ, కర్నూలు ఆర్డీవో ఎస్టీ కిడారి సందీప్‌కుమార్, నాన్ ఆఫీషల్స్ మెంబర్స్ మాలతి, సురేంద్ర, మాదిగ మద్దిలేటి, రవికుమార్, కే.మధు నాయక్, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ అసోసియేషన్ నుంచి వెంకట నాగరాజు, ఈడిగ సురేష్ కుమార్, కురువ మద్దిలేటిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

పెట్టుబడిదారులకు ఆహ్వానం : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టూరిజం ప్రాంతాలను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ విధానంలో అభివృద్ధి చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆదోని రామజులచెరువు, గాజులదిన్నె దామోదరం సంజీవయ్యసాగర్ ప్రాజెక్టు, తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామం వద్ద అశోకుని శిలాశాసనాలు, ఆదోని మండలం బనవాసి గ్రామం, పెద్దతుంబళం జైన్ ఆలయం, కల్లూరు మండలం లక్ష్మీపురం వద్ద ఉన్న శ్రీలక్ష్మి జగన్నాథగట్టు, ఓర్వకల్లు రాక్‌గార్డెన్, గార్గేయపురం చెరువు ప్రాంతాలను పర్యాటకపరంగా రెస్టారెంట్లు, రిసార్ట్స్, పార్కులు అభివృద్ధి చేసే వీలుందని వివరించారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు ముందుకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు 6309942034 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

మహిళా హెల్త్ సూపర్‌వైజర్లకు పదోన్నతి

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో పని చేస్తున్న 22 మంది హెల్త్ సూపర్‌వైజర్ (మహిళలు)లకు మంగళవారం పబ్లిక్ హెల్త్ నర్సు (నాన్ టీచింగ్) కడప ఆర్డీ డా. రామగిడ్డయ్య పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడుగురు పీహెచ్ఎన్‌లుగా పదోన్నతులు పొందారు. సి. రామక్క (హొళగుంద పీహెచ్‌సీ) ఏ.డీ. ఇందిర (పలుకూరు) ఆర్. ప్రభావతి (కొత్తపల్లి), మాణిక్యమ్మ (మద్దూరు పీహెచ్‌సీ), ఎస్. నాగలక్ష్మమ్మ (వెల్పునూరు పీహెచ్‌సీ) హేమలత (బి. పప్పూరు పీహెచ్‌సీ, అనంతపురం), టి. శ్యామలదేవి (పలుతూరు పీహెచ్‌సీ, అనంతపురం) స్థానాలను కేటాయించారు. మరో ఇద్దరు ఫిమేల్ హెల్త్ సూపర్‌వైజర్లు పదోన్నతులు తీసుకోలేదు.

భర్త హత్య కేసులో అరెస్టు

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం భర్త సురేష్ కంట్లో కారం చల్లి ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యచేసిన భార్య చిట్టెమ్మను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. మంగళవారం చిట్టెమ్మ హత్య జరిగి ఇంటి పరసరాల్లో సంచరిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. గోనెగండ్లకు చెందిన బలిజ సురేష్‌కు భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా సురేష్ భార్యను వేధించేవాడు. గత గురువారం రాత్రి అతడు భార్యతతో గొడవపడ్డాడు. రాత్రి ఏమి జరిగిందో ఏమో నిప్పు అంటుకొని సురేష్ కేకలు వేయడం మొదలుపెట్టాడు. కాలనీవాసులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి నాగమ్మ శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ విజయభాస్కర్ విచారణ చేపట్టారు. భార్యే హత్య చేసినట్లు నిర్ధారించుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బంగారుపేటలో ఎక్సైజ్ దాడులు

కర్నూలు అర్బన్/క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటలో సారా, బెల్లం ఊట నిల్వలను పోలీసులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఎక్సైజ్ అసిస్టెం ట్ కమిషనర్ హనుమం తరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 'నవోదయం'ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సారా స్థావరాలపె ఐదు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా దాడులు చేశారు. 65 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని 1,350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు సారాతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సారా తయారీ, విక్రయాలు మాను కోవాలని కోరారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్, నగర సీఐలు నాగరాజారావు, మన్సురుద్దీన్, నాగేశ్వర్, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, జయరాంనాయుడు, క్రిష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలకు ఆదేశాలు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అవినీతిపరులపై కొరడా ఝుళిపించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ ఇచ్చిన ఆధారాల మేరకు మంగళవారం మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ వారు అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంద్యాల మున్సిపాలిటీలో 2023 జనవరిలో రెండు రోజులు టౌన్ ప్లానింగ్ పలు విభాగాల్లో సోదాలు నిర్వహించారు. అప్పటి ఏసీపీ వల్లూరి సుజన్‌మోహన్ నరసింహమూర్తితో పాటు 10మందిపై అధికారిక పనుల్లో అవినీతి, భవననిర్మాణంలో, అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ధృవపత్రాలు జారీ చేయడంలో అవినీతిపై రామకృష్ణుడు ఏసీపీ, రంగస్వామి టీపీవో, రాణెమ్మ పీపీఎస్, బాలమద్దయ్య టీపీఎస్, రిజ్వానా టీపీబీవో, శబరీస్ టీపీబీవో, కృష్ణ సీనియర్ అసిస్టెంట్, ఉమా మహేశ్వరరావు టౌన్ సర్వేయర్, రవిచంద్రారెడ్డి కమిషనర్, రామచంద్రారెడ్డి కమిషనర్. వీరికి కొన్ని నెలల కిందట నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు చర్యలకు సిద్ధమయ్యారు.

మార్కెట్ యార్డులో వరి కొనుగోళ్లు



వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, తదితర ప్రధాన కాలువలు, చెరువుల కింద దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో వరి పంట సాగవుతున్నా ప్రభుత్వ స్థాయిలో ఉమ్మడి జిల్లాలో ఏ మార్కెట్ కమిటీ యార్డులోనూ ధాన్యం విక్రయాలు చేపట్టలేదు. ఇటీవలే కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయాలను చేపట్టారు. దీనివల్ల రైతులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కడంతో పాటు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయాలను చేపట్టామని, ఈ అవకాశాన్ని ధాన్యం పండించే రైతులంతా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి సెలవులకు ఇంటికి వస్తూ..

• రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం
• కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు



మృతి చెందిన శ్రావణి, వడ్డె ఈరన్న(ఫైల్)

విలపించిన భార్యాపిల్లలు

తన భర్త, కూతురు ఊరికి వస్తుండగా రోడ్డుప్రమాదంలో మృతి చెందరాని పోలీసుల నుంచి ఫోన్ రావడంతో ఒక్కసారిగా భార్య రాధమ్మ పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు. బోరున విలపిస్తూ ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం గదిలో విగతజీవులై పడి ఉండటం చూసి రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఆలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులకని కూతురిని తీసుకొని ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పెద్ద హోతూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... ఆస్పరి మండలం మూత్కూరుకి చెందిన ఈరన్న వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రాధమ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఒక్క కుమారుడు సంతానం. పెద్ద కూతురు ఇందు తల్లివెంట కూలీ పనికి వెళ్తుంది. రెండో కూతురు శ్రావణి చిప్పగిరి కస్తూర్బా స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. మంగళవారం శ్రావణిని తీసుకొని స్వగ్రామానికి ఈరన్న బయలుదేరాడు. మండ లంలోని పెద్ద హోతూరు సమీపంలోని గోకుల్ సిమెంట్ మిక్స్ లారీ, బైక్ ఢీకొన్నది. తండ్రీ కూతురు లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. శ్రావణి చదువులో మంచి ప్రతిభ కనబరచేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఉదయం అందరికి బైబై చెప్పి వెళ్లిందని ఇంతలో ఇలాంటి మరణ వార్త విద్యార్థులను స్నేహితులను కలచివేసింది

బాధిత కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి ఆలూరు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం వడ్డే ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున డిమాండ్ చేశారు.

మట్టిలో కూరుకుపోయి.. కార్మికుల దుర్మరణం



కార్మికులను బయటకు తీస్తున్న స్థానికులు

• భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదం
• గూడూరులో విషాదం
• ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారమివ్వాలి : సీపీఎం మండల కార్యదర్శి

గూడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మట్టి పనులు చేస్తూ జరిగిన ప్రమాదంలో ఇద్దరు భవన నిర్మాణకార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటన గూడూరు నగర పంచాయతీలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఓ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పునాదుల మట్టి పనుల్లో మధు(25), సోమన్న(35) పాటు మరి కొందరు కార్మికులు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పునాది మట్టి తీస్తుండగా పైన ఉన్న మట్టి పెల్లలు భవన నిర్మాణ కార్మికులు మధు, సోమన్న ఇద్దరిపై పడ్డాయి. ఇద్దరు కార్మికులు మట్టిలో కూరుకుపోయారు. ఇది గమనించిన తోటి కార్మికులు హుటాహుటిన మట్టిలో కూరుకు పోయినవారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని బయటకు తీయగా వారు అప్పటికే అపస్మారకస్థితికి చేరారు. పెంచికలపాడు దగ్గర ఉన్న ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మధుకు ఏడాది క్రితమే వివాహమైంది. భవన నిర్మాణ పనులు చేస్తు జీవనం చేస్తున్నాడు. సోమన్నకు భార్యతో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య ఘటనాస్థలిని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి: గూడూరులో పునాదులు తీస్తుండగా పై నుండి మట్టి కుప్పలు పడి ఇద్దరు భవన నిర్మాణ మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి జే మోహన్ డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడమల కాల్వకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం ఉదయం కృష్ణనంది సమీపంలోని అటవీప్రాంతంలో వట్టి కర్రలు తెచ్చుకునేందుకు పెద్ద వెంకటస్వామి ట్రాలీ ఆటోలో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దర్గా వద్ద ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న పెద్ద వెంకస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మిడుతూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలముడిపి గ్రామంలో ఒక యువకుడు మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బోయ రవికుమార్(26) పెళ్లి కాలేదని, అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మ హత్యయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు మిడుతూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రవికుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి బోయ రంగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఓబులేసు కేసు నమోదు చేసి శవపరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

మహానందిలో భక్తుడు..

మహానంది, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాల భోజరాజు(37) ఆలయం వెనుక వైపు మంచినీళ్ళ ట్యాంక్ పైభాగంలోని సిమెంట్ దిన్నెకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా మల్లుపల్లి గ్రామానికి చెందిన మాల భోజరాజు తన మిత్రులతో కలసి ఈనెల 15న పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు టూరిస్టు బస్సులో బయలు దేరారు. మంగళవారం మహానందికి చేరుకున్నాక భోజరాజు బహిర్భూమికి వెళ్తున్నట్లు మిత్రులకు చెప్పి ఆలయం వెనుక వైపుకు వెళ్లి ఉరేసుకున్నాడు. సంఘటన స్థలానికి మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి భోజరాజు మృతదేహాన్ని ట్యాంక్ నుంచి కిందకు దించారు. పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

బంగారు బిస్కెట్లు స్వాధీనం

• విలువ సుమారు రూ.60 లక్షలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

ఆదోని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.60 లక్షలు విలువ చేసే 6 బంగారు బిస్కెట్ల(600 గ్రాములు)ను టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. ఆదోని పట్టణంలోని ఎంబిజీ కాలనీకి చెందిన మహమ్మద్ ఫజల్ ప్రొద్దుటూరు నుంచి కారులో ఆదోనికి బంగారు బిస్కెట్లు తీసుకొస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి ఆదోని పట్టణ సమీపంలో ఆస్పరి బైపాస్‌లో కారును నిలిపివేసి మహమ్మద్ ఫజల్ నుంచి బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకొని, కారు, సెల్‌ఫోనును సీజ్ చేసినట్లు తెలిపారు. బంగారుకు సంబంధించిన బిల్లులు లేకపోవడం వల్ల స్వాధీనం చేసుకొని ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పచెప్పినట్లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై యుద్ధాన్ని ఆపి శాంతి చర్చలు జరపాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న విరసం రాష్ట్ర నాయకుడు పాణి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసులు, మావోయిస్టులపై జరుగుతున్న అమానవీయ యుద్ధాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని విరసం రాష్ట్ర నాయకుడు పాణి అన్నారు. మంగళవారం ప్రఖ్యాత విప్లవ నాయకుడు లెనిన్ 155వ జయంతి సందర్భంగా ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని సీపీఐ కార్యాలయంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధం - కాల్పుల విరమణ - శాంతి చర్చలు' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి చత్తీస్‌ఘడ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు నాయకులను టార్గెట్ చేసుకొని పదివేల సైనికులు చుట్టుముట్టారని, హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబింగ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధాన్ని ఆపి శాంతి చర్చలకు ప్రభుత్వం సిద్ధం కావాలని కోరారు. 'వక్ఫ్ సవరణ చట్టం - రాజ్యాంగ ఉల్లంఘనలు' అనే అంశంపై ఎస్‌డీపీఐ రాష్ట్ర నాయకుడు ఫాజిల్ దేశాయ్ మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణ చేస్తున్నదని, దీన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. 'లెనిన్-సోషలిజం నేటి ప్రాంసగికత' అనే అంశంపై ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి సోషలిస్టు విప్లవ నాయకుడు లెనిన్ స్ఫూర్తితో మన దేశ పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ సభలో ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ రత్నం ఏసేపు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

కర్నూలు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడలకు క్రీడాకారులను ఎంపిక ప్రక్రియ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా రేంజ్‌ల నుంచి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారు ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో కర్నూలు రేంజ్ (కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య) జిల్లాల నుంచి పోలీసులకు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు ఎంపిక మూడు రోజులు పాటు జరుగనున్నాయి. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, షటిల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, క్రికెట్, బాస్కెట్‌బాల్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, ఆర్ఐలు, కర్నూలు, నంద్యాల కడప, అన్నమయ్య జిల్లాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 23 నుంచి 29 వరకు జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు రెగ్యులర్ 3,537, సప్లమెంటరీ విభాగంలో 545 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

జూన్‌లో ఏపీ పీజీ సెట్

• మే 5వరకు దరఖాస్తులకు గడువు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ పరిధిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థుల కోసం ఏపీపీజీ సెట్-2005 పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎకానామిక్స్ డిపార్టుమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 5 లోపు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎకనామిక్స్‌లో చేరడానికి డిగ్రీలో బీఏ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న వారితో పాటు, డిగ్రీ పూర్తి చేసుకున్నవారు ఎంఏ ఎకనామిక్స్ కోర్సులో ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధితో పాటు కంప్యూటర్ కోర్సును కూడా ఎకనామిక్స్ సిలబస్‌లో భాగంగా నేర్చుకునే అవకాశముందని సూచించారు.

ఉపాధి కూలీ బకాయిలు త్వరలో జమ

• డ్వామా పీడీలు వెంకట రమణ, వెంకట సుబ్బయ్య



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన రూ.961.46 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని జిల్లాల వారీగా కేటాయింపులు చేసి త్వరలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీల బ్యాంకు అకౌంట్లకు జమ చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు వెంకటరమణ, వెంకట సుబ్బయ్య తెలిపారు. ఫిబ్రవరి నుంచి కూలీలకు రావాల్సిన బకాయిలు కొద్ది రోజుల్లోనే వారి ఖాతాలకు జమ కానున్నాయి. కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలంటూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఇటీవల పలు మార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారని, ఈ క్రమంలోనే కూలీల వేతనాలు విడుదలైనట్లు స్పష్టం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేతన బకాయిలు దాదాపు రూ.150 కోట్ల దాకా రావాల్సి ఉందని ఈ వేతన బకాయిలు అందిన వెంటనే మెటీరియల్ కాంపోనెంట్ కింద రావాల్సిన నిధులు కూడా త్వరలోనే మంజూరవుతాయని నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

పనులను వేగవంతం చేయాలి: ఎస్ఈ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేషన్ ఎస్ఈ రాజశేఖర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న వివిధ రకాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కార్పొరేషన్ ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. మంగళవారం 13వ వార్డు బంగారుపేటలో జరుగుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ ఆనంద్ థియేటర్ వెనుక భాగంలో కేసీ కెనాల్ పక్కన ప్రధాన రహదారి నుంచి కేవీఆర్ కళాశాల సమీపం వరకు రూ.40 లక్షలతో ఈ రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. ఆయన వెంట ఎంఈ సత్యనారాయణ, డీఈఈ కృష్ణలత, ట్రైనీ ఎఈ మహేష్ ఉన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్టాండు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్న క్యాంటీన్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండరాదని, తప్పనిసరిగ్గా నాణ్యత పాటించాలని అన్నారు. అన్న క్యాంటీన్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించామన్నారు. ముందుగా చత్రీబాగ్, పాతబస్తీ, ఎన్ఆర్‌పేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆస్తి, తాగునీటి కొళాయి పన్నుల వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అశోకా మహిళా కాలేజీ యాజమాన్యం రూ.12.64లక్షలు, ఏపీ స్టేట్ వేర్‌హౌస్ కార్యాలయ అధికారులు రూ.6.71 లక్షల ఆస్తి పన్నులను అందజేశారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ మొండి బకాయిలతోపాటు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపులపై వర్తింపజేస్తున్న 5 శాతం రాయితీ, బకాయి వడ్డీలపై 50 శాతం మాఫీలను పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ల వారీగా మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ జునైద్, ఆర్ఐ మన్సూర్, స్పెషల్ ఆఫీసర్ ఖలీల్ నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తడకనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సర్పంచు ఎస్.సహారాబీ, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ సన్మానించారు. మంగళవారం పాఠశాలలో శ్రీనివాసులు పదవీ విరమణ పొందడంతో తడకనపల్లె, ఓబులాపురం, వామ సముద్రం పాఠశాలల ఉపా ధ్యాయులందరిని శాలువాలతో సన్మానించారు. జనసేన నాయకుడు సలాం బాషా, ఎస్ఎంసీ చైర్మన్ పెద్దయ్య, స్వాములు, మదన గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే భవిష్యత్తు : ఎంఈవో

కోడుమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో తైమూరు బాషా అన్నారు. స్థానిక విశ్వవాణి స్కూల్లో మంగళవారం నిర్వహించిన అకాడమీ ర్యాంకుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బుధవారం పదో తరగతి ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయనున్నాయని, విద్యార్థులు వచ్చిన మార్కు లతో తృప్తి పొంది ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు ర్యాంకులను ప్రదానం చేశారు. పాఠశాల యాజమాన్యం ఖలీల్, గిడ్డయ్య పాల్గొన్నారు.

నేడు జిల్లా ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి టి.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ 18-40 సంవత్సరాల లోపు బాలబాలికలకు, స్త్రీ, పురుషులకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు. ఎంపికైన జిల్లా ఉషూ క్రీడాకారులు మే 5న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనాలని, వివరాలకు 9440047196ను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ భూతం

- యథేచ్ఛగా వినియోగం
- ప్రజల్లో కొరవడిన చైతన్యం
- నిద్రావస్థలో యంత్రాంగం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెనుభూతంగా పరిణమించిన నిషేధిత ప్లాస్టిక్‌పై నియంత్రణ కొరవడింది. యథేచ్ఛగా విక్రయాలు, విచ్చలవిడిగా వినియోగం సాగుతోంది. నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండగా కొన్నిప్రాంతాల్లో సిబ్బంది కనుసన్నల్లో విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు అడపాదడపా తనిఖీలతో హడావిడి చేస్తున్నారే తప్ప ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు. గత వైసీపీ హయాంలో అధికారులు దాడులు చేసినా అవి మనవాళ్లవే వదిలేయండంటూ ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు చేయడమే లేదని కొందరు విమర్శిస్తున్నారు. దీంతో అధికారులు సైతం దాడులు చేసేందుకు వెనకాడుతున్నారు. ఒకవేళ దాడులు చేసి పట్టుకున్నా అధికారులపై బదిలీ వేటు పడుతుంది.

నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు

నగరంలో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. నగరంలో 52 వార్డులున్నాయి. వేల సంఖ్యలో కిరాణా దుకాణాలు, హోటళ్లు రహదారులపై కూరగాయలు, పండ్ల విక్రయాలు, మాంసం దుకాణాలు ఉన్నాయి. నగర పరిధిలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతరత్రా వస్తువులను విపరీతంగా వినియోగిస్తున్నారు. ప్రతిరోజు వందల కిలోల ప్లాస్టిక్ వినియోగిస్తున్నా చర్యలు మాత్రం శూన్యమే.



అమలు కాని నిషేధం

నగర పరిధిలో 2022 జులై నుంచి ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమలులో ఉంది. కానీ ఇది ఎక్కడా అమలుకావడం లేదు. నగరపాలక అధికారులు సైతం పట్టించు కోవడం లేదు. ఫిర్యాదు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రైతుబజార్లు, పూలమార్కెట్, మాంసం దుకాణాలు, కిరాణా దుకాణాల్లో యథేచ్ఛగా వాడుతున్న దాడులు చేయడంలేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిసారి జరిమానా, ఆ తరువాత లైసెన్సు రద్దు చేయాల్సి ఉంటుంది. చిరు వ్యాపారులు, దుకాణ దారులైలే రూ.2,500 నుంచి రూ.5వేల వరకు జరిమానా చెల్లించాలి. వినియోగ దారుడి చేతిలో ప్లాస్టిక్ సంచి ఉన్న జరిమానా విధించాల్సి ఉంది. నగర పరిధిలో అధికారుల తనిఖీలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ప్రతి నెల టన్నుల వినియోగం జరుగుతున్న దాడులు మాత్రం కానరావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

20 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న..

1999లో కేంద్ర పర్యావరణ శాఖ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులను ఉత్పత్తి చేయడం, విక్రయించడం, వాడటం నేరం. ప్లాస్టిక్ సంచులను తయారుచేసే ఉత్పత్తి సంస్థల పేరు, చిరునామా, పరిమాణం తప్పనిసరిగా ముద్రించాలి. నిబంధనలు ఉల్లంఘించిన ఉత్పత్తి సంస్థలకు జరిమానా విధిస్తారు. ప్లాస్టిక్ స్థానంలో బట్ట, కాగితం, నారసంచులు, వెదురు బుట్టలు వాడొచ్చు. విక్రయదారులు, వినియోగదారులపై భారీ జరిమానాలు విధించాలి. అప్పుడే ప్రజల్లో మార్పు వస్తుంది.

ఆరోగ్యానికి హాని

- అతి తక్కువ మందం, పలుచగా ఉండే ప్లాస్టిక్ వస్తువులు అంత త్వరగా భూమిలో కలిసిపోయే అవకాశం లేదని, ఇవి భూమిలో కలిసిపోవాలంటే వందల సంవత్సరాలు పడుతుందని పరిశోధనల్లో తేలింది.
- పెట్రో రసాయనాల నుంచి వీటిని తయారు చేయడంతో వాటిలో ప్రజారోగ్యానికి హాని కలిగించే టాన్సిస్ అనే రసాయనం ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి.
- నిషేధిత ప్లాస్టిక్‌కు నిప్పు పెడితే దాని నుంచి వెలువడే టాక్సిన్స్ పొగ వాయు కాలుష్యం కలిగిస్తోంది.
- పశువులు వీటిని తినడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమై వాటి పాలు కలుషితమవుతున్నాయి.

దాడులు చేస్తూనే ఉన్నాం



నగరంలో ప్లాస్టిక్‌పై నిత్యం దాడులు చేస్తూనే ఉన్నాం. గత పాలకవర్గంలోనే మం దానికి సంబంధం లేని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని తీర్మానం చేశారు. నగర పాలక సంస్థ పరిధి కాకుండా చుట్టు పక్కల గ్రామాల్లో ప్లాస్టిక్ గోడౌన్లను ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో నగరంలో విక్రయిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి శాఖతో సంయుక్తంగా దాడులు చేస్తున్నాం. ప్రధానంగా ప్రజల్లో చైతన్యం వస్తేనే పర్యావరణాన్ని పరిరక్షించొచ్చు.

-కె.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ, కర్నూలు

ఏడు శాతం రిజర్వేషన్ కల్పించాలి: ఎమ్మార్పీఎస్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం షెడ్యూల్ కులాల ఏబీసీ వర్గీకరణ అమలులో రోస్టర్ విధానాన్ని సవరించి ఏ గ్రూపులో ఉన్న రెల్లి ఉపకులాలకు ఒక శాతం, బీ గ్రూపులో ఉన్న మాదిగ ఉపకులాలకు 7 శాతం, సీ గ్రూపులో ఉన్న మాల ఉప కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. మంగళవారం ఆయన డీఆర్వో వెంకట నారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ఉద్యోగ నియామకాలు 2025-26 విద్యా సంవత్సరం అడ్మిషన్లలో వర్గీకరణ అమలుచేస్తూ ఆర్డినెన్స్‌కు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించి తమిళనాడు తరహాలో పార్లమెంటులో శాశ్వత పరిష్కారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బైరాపురం రాజు, సూరిబాబు, రాజశేఖర్, రామదాసు, లక్ష్మన్న, నాగరాజు, మీసాల దాసు, సుజాతమ్మ, సుంకులమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

టీడీపీ సభ్యత్వ కార్డులు విడుదల



సభ్యత్వ కార్డులను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చేతుల మీదుగా మంగళవారం టీడీపీ సభ్యత్వ కార్డులను విడుదల చేశారు. మండలంలోని పసుపుల గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సభ్యత్వ నమోదులో కూడా కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహం కనబరిచారని అన్నారు. కోడుమూరు పట్టణంలో సుమారు 2500 మంది చేత సభ్యత్వం చేయించిన కార్యకర్తలు, నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, బ్రిటీష్‌రాముడు, మధు, పురుషోత్తమరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులందరికీ ఆరోగ్య పరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన టీకాలు వేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. నగరంలోని కింగ్‌మార్కెట్ దగ్గర ఉన్న ఈడెన్ గార్డెన్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హజ్ యాత్రికు లకు వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సిన్ వేసి సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. హజ్ యాత్రికులందరూ ఎలాంటి అపోహలు లేకుండా ఓరల్ పోలియో, మేనింగ్లోకోకల్, ఇన్‌ఫ్లూ ఎంజా వ్యాక్సిన్ వేయించుకుని సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ఆరోగ్య పర్యవేక్షకుడు శివకుమార్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం కార్యాలయంలో లెనిన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు రామకృష్ణ, పి.నిర్మల, ఎండీ ఆనంద్‌బాబు, కేవీ నారాయణ, అంజిబాబు, రాముడు పాల్గొన్నారు.

- సీపీఐ కార్యాలయంలో లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సీపీఐ సీనియర్ నాయకుడు కె.జగన్నాథం మాట్లాడు తూ ప్రపంచ కార్మిక పోరాటాలను నిర్మించడంలో లెనిన్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లెనిన్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ కూడలిలో ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం కూడలిలో అడ్డా కూలీలతో కలిసి తాగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. యాకోబు, ఎస్ రమణగౌడు, మహిళా మేస్త్రి నాగమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ పూజ



సోమయాజులపల్లెలో కలశ పూజలో పాల్గొన్న భక్తులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో సుంకులా పరమేశ్వరి బోడ్రాయి ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం కలశ పూజ, హోమం చేశారు. అర్చకులు మోహన్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు హోమం పూజల్లో పాల్గొ న్నారు. ఉదయం మహాగణపతి పూజ పుణ్యాహవాచనం, రక్ష స్థాపనయాగ శాల ప్రవేశం, ద్వార పూజ, కలశ స్థాపన నిర్వహిం చారు. 23న యాగం, జప హోమాలు, మంగళ హారతి, గ్రామో త్సవం, కోలాటం, 24న ప్రాతకాల పూజ, యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు కార్యక్రమంలో గ్రామస్థులు ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, శ్రీనివా సులు, రమణ, శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.


పీడీ పోస్టులను కన్వర్షన్ చేయొద్దు



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీలుగా పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను లెక్చరర్లుగా కన్వర్షన్ చేయడం తగదని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్నకు వ్యాయామ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో వ్యాయామ విద్య లేకుండా చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. ఇంటర్‌లో వ్యాయమ విద్యకు తీరని విఘాతం కలుగుతుందన్నారు. గతంలో కొన్ని కళాశాలలకు కొన్ని పోస్టులు మంజూరు కాకపోవ డాన్ని సాకు చూపిస్తూ పీడీలను షిఫ్టు, కన్వర్షన్ పేరుతో లెక్చరర్లుగా మారుస్తున్నారని వాపోయారు. ఈ పీడీ పోస్టులను ఇతర సబ్జెక్టుల ను కన్వర్షన్ చేయడంతో విద్యార్థులకు వ్యాయమ విద్య దూరమవు తుందన్నారు. ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో వ్యా యామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం విజయకుమార్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఘనంగా తిమ్మగురుడు స్వామి ప్రభోత్సవం



ప్రభోత్సవానికి హాజరైన భక్తులు

గూడూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో తిమ్మగురుడు స్వామి జాతర సందర్భంగా స్వామివారి ప్రభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యుడికి సన్మానం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్టణంలో జరిగిన ఏఐకేఎస్ మహాసభల్లో కర్నూలు కు చెందిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథంను జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జగన్నాథంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు మాట్లాడారు. నగర కార్యదర్శి పి.రామక్రిష్టారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లెనిన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



మాట్లాడుతున్న వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో పసుపుల గ్రామంలోని శ్రీహరి అగ్రికల్చర్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సెట్కూరు సీఈవో, జిల్లా యువజన సంక్షేమ అధికారి కె.వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ ఇంధన వనరుల వాడకం తగ్గించాలన్నారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. అటవీశాఖ కర్నూలు తరఫున సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ సభ్యుడు మహ్మద్ ఇద్రుస్ మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుడమికి రక్షణ చెట్లు

కాలుష్య నియంత్రణ బోర్డు ప్రాంతీయ అధికారి పీవీ కిషోర్ రెడ్డి



జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొక్క నాటుతున్న పీవీ కిషోర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, విద్యార్థులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్టే పుడమికి రక్షణ కవచంగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే అవి వృక్షాలై ఎదిగి భవిష్యత్తు తరాలకు పర్యావరణ హితంగా నిలుస్తాయని ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు కర్నూలు ప్రాంతీయ అధికారి, పర్యావరణ ఇంజనీర్ పీవీ కిషోర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో 2025-ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర శివారులోని జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల్లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పీవీ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ సమతుల్యానికి, కాలుష్య నియంత్రణలో చెట్లు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత జిల్లా అటవీ శాఖ అధికారి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ భూమిపై వృక్ష సంపద అంతరించిపోవడం వల్ల వాతావరణం వేడెక్కుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో భాగంగా ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు జోనల్ కార్యాలయంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

తాగునీటి వృథాను అరికట్టండి



వీకర్ సెక్షన్ కాలనీలో తాగునీటి లీకేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో తాగునీటి వృథాను అరికట్టాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు కోరారు. మంగళవారం సీపీఎం బృందం ఆధ్వర్యంలో 37వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గత వారం రోజులుగా వీకర్‌సెక్షన్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమీప కాలనీల్లో తాగునీరు దొరకక ప్రజలు అల్లాడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్.అలివేలమ్మ, శ్యామల, అబ్దుల్‌రహమాన్, సత్య, జమ్మన్న పాల్గొన్నారు.

యాపర్లపాడులో తాగునీటి పైపులైన్ పరిశీలన

కల్లూరు మండలం యాపర్లపాడులో నూతన తాగునీటి పైపులైన్‌ను ఎంపీడీవో జి.నాగశేషాచల రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌తో కలిసి ఆయన ప్రజల తాగునీటి బోరు, పైపులైన్‌ను పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రజా వేదిక శుక్రవారానికి మార్పు

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికను శుక్రవారానికి మార్చినట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. ఇదివరకు ప్రతి బుధవారం నిర్వహించేవారమని అధిష్ఠానం ఆదేశాల మేరకు శుక్రవారానికి మార్చామని ప్రజలు గమనించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆదోని రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగిణి వసంత తెలిపారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్-3లో పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం.పి. విమల, మహిళా పోలీసులు లక్ష్మీదేవి, హెల్పర్లు బాలమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్‌లో ప్రతిభ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు వడ్డె నేహా, చెన్నకేశవ ప్రతిభ చాటారు.



చెన్నకేశవ(991)



నేహ(990)

పత్తికొండకు చెందిన రమేష్, కళ్యాణి దంపతుల కుమారుడు చెన్నకేశవ ఎంపీసీలో 991/1000 మార్కులు సాధించారు. వడ్డె రాజగోపాల్, అనిత కుమార్తె నేహ బైపీసీలో 990/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో రంగస్వామి, ఎంఈవో-2 గోపాల్ కోరారు. మంగళవారం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పించాలన్నారు. బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు విశ్వనాథ్, సుధాకర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



మాట్లాడుతున్నమున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 38,41 వార్డుల్లో పారిశుధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ పరిశీలించారు. రోడ్లు శుభ్రం చేయడంతో పాటు చెత్త సేకరణ, తరలింపును తనిఖీ చేసి వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రలో వార్డు ప్రజలు కూడా భాగస్తులు కావాలని, పరిసరాలతో పాటు వార్డును కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను కాలువలలో పడేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, నీటి పరీక్షల కోఆర్డినేటర్లు విష్ణు చంద్ర అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయంలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు నీటి పరీక్షలపై అవగాహన కల్పించారు. తాగునీటి పరీక్షలు చేయిస్తే నీటిలో ఫ్లోరైడ్ శాతం అర్థం అవుతుందన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మార్క్సిస్టు ఉద్యమ నేత లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మార్క్సిస్ట్ జయంతి సీపీఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ్వాన దినోత్సవం సందర్భంగా తిక్క స్వామి దర్గా వద్ద జెండాను ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని విస్మరించి మనువాద భావజాలాన్ని చాపకింద నీరులా అమలు చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సోమశేఖర్, భాష, షాషావలి, హుస్సేన్, శివరాములు, ఉపేంద్ర, వీరయ్య పాల్గొన్నారు.

తరగతులను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతుల కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

నేర ప్రవృత్తిని వీడాలి

తుగ్గలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తిని వీడాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు కృష్ణమూర్తి, మల్లికార్జున సూచించారు. మంగళవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషల్లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి, అల్లర్లు సృష్టించవద్దని, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు వస్తే సత్ప్రవర్తన కింద రౌడీషీట్లను ఎత్తివేస్తామన్నారు.

నీరు కావాలంటే బండి కట్టాల్సిందే..!



ముద్దనగేరి గ్రామంలో ఎద్దుల బండిపై నీరు తెస్తున్న గ్రామస్థులు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దనగేరి కురకుంద గ్రామంలో 15రోజుల నుంచి తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు కావాలంటే బండి కట్టాల్సి వస్తోంది. ట్యాంకులు పెట్టుకుని వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విరుపాపురం జలాశయం నుంచి తాగునీరు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ముద్దనగేరి సర్పంచి సుధాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసారులు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలువనే పూడ్చేశారు..!

● తుగ్గలి మండలం రాంపల్లెలో ఇష్టారాజ్యం

రాంపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై నిర్మించిన కాలువను కొందరు పూడ్చివేయడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. - తుగ్గలి



పూడ్చకుండా వదిలేశారు.!



మండల కేంద్రంలోని మెయిన్‌బజారులో పంచాయతీ సిబ్బంది రోడ్డుపక్కనే గుంతను తవ్వి వదిలేశారు. 15 రోజులైనా ఆ గుంతను పూడ్చలేదు. దీంతో వాహనదారులు, పాదచా రులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని, వెంటనే పూడ్చాలని స్థానికులు, దుకాణదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. - మద్దికెర



సర్వేయర్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

సర్వేను అడ్డుకున్న రైతులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులు మంగళవారం అడ్డుకున్నారు. వివరాల మేరకు.. చిన్నహుల్తి గ్రామ సర్వే నెం. 167లో 1.35 సెంట్లు భూమి తనదని పట్టణానికి చెందిన మొహిద్దీన్ అనే వ్యక్తి తనదంటూ సర్వే చేసి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ గాదె లింగప్ప, వీఆర్వో రంగస్వామి, గ్రామ సచివాలయ సర్వేయర్ నాగేంద్రనాయక్ వెళ్లగా బోయ రంగస్వామి, బోయ శ్రీరాములు అనే వ్యక్తులు తమకు పూర్తికుల నుంచి భూమి వచ్చిందని వాగ్వాదానికి దిగారు. స్పందించిన రెవెన్యూ అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సర్వే నెంబరు భూమి కోర్టులో ఉందని, పొలంలోకి ఎవరూ ప్రవేశించరాదంటూ తహసీల్దార్ బోర్డును ఏర్పాటు చేయించారు.

గ్రామానికి చేరుకున్న హత్య కేసు నిందితులు

● పోలీసుల భారీ బందోబస్తు, బొమ్మిరెడ్డి పల్లెలో పికెటింగ్

వెల్దుర్తి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో జూన్9న టీడీపీ నాయకుడు గిరినాథ్ చౌదరి హత్య అనంతరం 16మంది నిందితులు, వైసీపీ మద్దతుదారులు 16మంది గ్రామాన్ని వదిలి వెళ్లారు. అనంతరం తమను స్వగ్రామానికి చేర్చాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఏప్రిల్ 7న పోలీసు బందోబస్తు మధ్య 27 మందిని గ్రామానికి చేర్చారు. అయితే మిగతా వారిని ఆరోజు అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. కాగా 5 కుటుంబాలకు చెందిన బాస్కర్, రంగయ్య, సూర్యనారాయణ, వెంకటేష్, రాజేష్‌ను వెల్దుర్తి, దేవనకొండ, పత్తికొండ, కర్నూలు వన్ టౌన్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐలు మధుసూదన్ రావు, వంశీనాథ్, జయన్న, రామయ్యనాయుడు, విజయలక్ష్మి బందోబస్తు మధ్య వారిని మంగళవారం ఇళ్లకు చేర్చారు. వెల్దుర్తి ఎస్‌ఐ అశోక్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.



ఇంటికి చేరుకున్న నిందితులు

క్రిష్ణగిరి ఎస్‌ఐ మల్లికార్జున, హొళగుంద ఎస్‌ఐ దిలీప్ కుమార్ ఉన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ హెచ్చరించారు. మంగళవారం మెయిన్‌బజారులో అక్రమ కట్టడాలు తొలగించారు. అక్రమ కట్టడాలతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రహదారి, పంచాయతీ స్థలాల ఆక్రమణ చట్టరీత్యా నేరమన్నారు.



మెయిన్‌బజార్‌లో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

యాజమాన్య పద్ధతులతో దిగుబడి

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో రవి సూచించారు. మంగళవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడవద్దని, భూసార పరీక్షలు చేయించు కోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

జింకల బెడదపై స్పందించిన డిప్యూటీ సీఎం

● నివేదిక ఇవ్వాలని అటవీ అధికారులకు ఆదేశం



లేఖను ఇస్తున్న ఫారెస్ట్ అధికారులు

ఆలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంతంలో జింకల బెడదతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సస్పందించారు. జింకల దాడితో రైతులు పంటలు నష్టపోతున్నారని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సమస్యపై నివేదిక ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆదోని పారెస్ట్ రేంజ్ అధికారి తేజస్వి ఆదేశాల మేరకు ఆలూరులో సెక్షన్ అధికారులు శ్రీనివాసులు, హొళగుంద బీట్ అధికారులు బాలకృష్ణ, మధు మోహన్, విమల్ ఫిర్యాదుదారుడు నారాయణ రెడ్డిను కలసి చర్చించారు. జింకల పార్కు ఏర్పాటుకు ఆలూరులో స్థలం లేకపోవడంతో మంత్రాలయం పరిధిలోని తుంగభద్ర ప్రాంతంలో జింకల పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని అధికారులు హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు నారాయణ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

భూ సమస్యలు మా దృష్టికి తీసుకురండి

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని ఉత్తరం గ్రూపులో భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ సూచించారు. మంగళవారం సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకంలో పేరు, మొబైల్ నెంబర్, ఆధార్‌లో మార్పా లన్నా, అడంగల్‌లో పేరు తప్పున్నా రెవెన్యూ వీఆర్వోలను సంప్రదిం చాలన్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని అవమానించారు

ఆదోని టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బీదర్, షిమోగా పట్టణాల్లో జరిగిన సీఈటీ ప్రవేశ పరీక్షలు రాయడానికి వెళ్లిన బ్రాహ్మణ విద్యార్థులను అవమానించారని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రవీంద్ర నాథ్ దేశాయ్ ఆరోపించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ యగ్నోపవీతం తీసేందుకు నిరాకరించిన కొందరు విద్యార్థులు పరీక్ష రాయకుండా తిరిగి వెళ్లిపోయారన్నారు. మఠం రామచంద్ర వైద్యం నాగరాజ్, లోక్ నాథ్ శాస్త్రి, కమల్నాథ్ శర్మ పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీటితో ట్యాంకులను నింపాం



ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు

ఆదోని రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్ ట్యాంకులను ఎల్లెల్సీ నీటితో నింపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు కృష్ణాచారి తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ మండలంలో 6 ఎస్ఎస్ ట్యాంకులు, సీపీడబ్ల్యూఎస్ స్కీం కింద 6 ట్యాంకులు ఉన్నాయన్నారు. సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని, ప్రజలు నీటిని వృథా చేయకుండా ఏఈ తెలిపారు.

మొక్కలను సంరక్షిద్దాం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హెచ్‌ఎం భాస్కర్, యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న విద్యార్థులకు సూచించారు. మంగళవారం దూదేకొండ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ధరిత్రీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని పెద్ద హరివాణం జడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం ఇందిరా దేవి అన్నారు. మంగళ వారం పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంపికకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. స్కౌట్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ పొందవచ్చన్నారు. శిక్షకులు రామన్న, ప్రమీల పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

దానగుణం ఉండాలి



పెళ్లి సామగ్రి ఇస్తున్న ఏఎస్‌ఐ ఫణిరాజు

మద్దికెర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో దానగుణం ఉండాలని ఏఎస్‌ఐ ఫణిరాజు, ఎల్‌ఐసీ ఏజెంట్ విజయకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన చిన్న ఓ యువకుడి వివాహానికి తాళిబొట్టు, మెట్టెలు, నూతన పట్టువస్త్రాలు ఏఎస్‌ఐ ఫణిరాజు చేతుల మీదుగా అదించారు.

పనులు కల్పించాలి

తుగ్గలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూలీ లందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. మంగళ వారం మండలంలోని జొన్నగిరి, ఎద్దులదొడ్డి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. పనులకు రాని వారి పేర్లను మస్టర్‌లో చేరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.300 అందు తుందన్నారు. పనులకు సంబంధించిన రికార్డులు, ఫోటోలు ఖచ్చితంగా ఉండాల న్నారు. యంత్రాలతో పని చేయిస్తే చర్యలు తప్పవన్నారు. టీఏలు రాజశేఖర్, రామకృష్ణ, ఎఫ్‌ఏ రవికుమార్, మల్లన్న, అంజి, జయచంద్ర పాల్గొన్నారు.



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

వెల్దుర్తి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో నిర్వహిస్తున్న పోషకాహార పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సీడీపీవో లూక్ అధ్యక్షతన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను ప్రజలకు వివరించి, టీచర్లు అవగాహన కల్పిం చాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. జిల్లా కోఆర్డినేటర్ బాలు, వెలుగు కోటేశ్వరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, హెల్త్ అసిస్టెంట్ రంగవల్లి, ప్రాజెక్టు సాయి, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు సరస్వతి, శ్రీదేవి, సునిత, సుగుణ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుజాత పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ చంద్రబాబుతోనే సాధ్యమైంది

ఆదోని టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మెగా డిఎస్సీ చంద్రబాబుతోనే సాధ్యమైందని టీడీపీ మాజీ కౌన్సిలర్లు బాలాజీ, శ్రీనివాస ఆచారి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ డీఎస్సీ ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేకపోయిందని విమర్శించారు. ఇచ్చిన హామీపే మేరకు టీడీపీ ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ తరువాతే పోస్టుల భర్తీ అని చంద్రబాబు చేసిన వాగ్దానం ప్రకారమే రెండు హామీలు కూడా నెరవేర్చారని, నిరుద్యో గులు ఆనందం వ్యక్తం చేసున్నారని అన్నారు. 1994 నుంచి టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలం, ఈ ఏడాది డీఎస్సీతో మొత్తం 1,96,619 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి చంద్రబాబు నిరుద్యోగులను ఆదుకున్నారని అన్నారు.



మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్లు

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అలీమ్ సిద్ధికి, స్టాండర్డ్ క్లబ్ మెంటర్ సుధాకర్ బాబు అన్నారు. మంగళవారం భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. మొదటి బహుమతి సాధించిన విద్యారిని మహేశ్వరికి రూ.1,000, రెండో బహుమతి పొందిన వైష్ణవికి రూ.750, మూడో స్థానిలో నిలిచిన అరుణకు రూ.500, కన్సోలేషన్ బహుమతి ఈశ్వరికి రూ.250తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ద్యార్థులు వస్తువులను కోనేముందు వాటి నాణ్యతను పరీక్షించి బీఐఎస్, ఐఎస్‌ఐ ముద్ర ఉందోలేదా పరీక్షించి కొనాలన్నారు. తల్లిదండ్రులకు వీటిపై అవగాహన కల్పించాలని కోరారు.

సోషలిస్టు నిర్మాత లెనిన్

● సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించిన నిర్మాత లెనిన్ అని, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో 155వ జయంతిని పురస్కరించుకుని లెనిన్ చిత్రపటానికి నివాళి అలర్పించారు. రష్యాలో 1917లో జరిగిన అక్టోబర్ విప్లవానికి లెనిన్ సారథ్యం వహించారన్నారు. భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్, సురేంద్ర కుమార్, గురుదాస్, తిమ్మయ్య, కారన్న, నెట్టికంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెక్కరథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. మంగళవారం చైత్రమాస బహుళ నవమిని పురస్కరించుకొని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళవాయిద్యాలు భక్తుల హర్షధ్వానాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవలో స్వామివారిని ఊగించారు. అంతకుముందు స్వామివారికి పాదపూజ చేసి పల్లకీలో ఊరేగించి హారతులు నిర్వహించారు. పండితులు సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ అన్నారు. మంగళవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యేసెపుతో కలిసి ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాలను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ 26వేలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామిక వాదులు, కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిష్టప్ప, రామలింగ, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేవీకేలో కిసాన్ మేళా

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో బుధవారం పత్తిలో కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన నంద్యాల, కర్నూలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

బియ్యం మింగేస్తున్న డీలర్లు

నందవరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వచ్చే రేషన్ బియ్యాన్ని డీలర్లు మింగేస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గువ్వల నారాయణ అన్నారు. మంగళవారం నందవరం తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈనెలలో బియ్యం వేయకపోవడంతో రేషన్ షాపుకు వెళ్లి అడిగితే స్టాక్ అయిపోయింది అంటున్నారు. నెలలో ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు వేస్తారో ప్రజలకు చెప్పాలని కోరారు. అధికారులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ట్యాంక్ పరిసరాల్లో పారిశుధ్య పనులు



తాగునీటి ట్యాంక్ చుట్టూ ఉన్న చెత్తను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామంలో చౌడమ్మకుంట దగ్గర ఉన్న తాగునీటి ట్యాంక్ దగ్గర పంచాయతీ కార్మికులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ట్యాంక్ పరిసరాల్లో చెత్తాచెదారం నిండిఉండటమే కాక ఆప్రాంతం బురదమయంగా మారింది. తాగునీటి కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీన్ని గమనించిన గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు పారిశుధ్య పనులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు.

రోడ్డు కనిపించడం లేదు

- ఇటుకల బట్టీల నుంచి దుమ్ము ధూళి
- వాహనదారుల అవస్థలు



ఇటుకల బట్టీ నుంచి వస్తున్న దుమ్ముతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పక్క చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన రహదారిలో మదర్‌థెరిస్సా బీఈడీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఇటుకల బట్టీవి. ఈ ఇటుకల బట్టీని ప్రధాన రహదారి పక్కనే దాదాపు 10 ఎకరాలలో ఏర్పాటు చేశారు. నిత్యం ఈ ప్రధాన రహదారి గుండా వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. జిల్లాస్థాయి ఉన్నతాధికారులు సైతం ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం రావాలంటే ఈ దారిగుండానే వస్తుంటారు. అయితే ఇటుకల బట్టీ నుంచి వచ్చే దుమ్ము, పొగ, పొట్టుతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం పెద్దఎత్తున వీచిన ఈదురు గాలులకు ఇటుకల బట్టీ నుంచి వస్తున్న పొగ, దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇటుకల బట్టీ నుంచి వచ్చే పొగ, దుమ్ము కమ్ముకుపోవడంతో ఒక్కసారిగా రోడ్డు ఏ మాత్రం కనిపించకుండా పోయింది. వాహనదారుల కళ్లల్లో దుమ్ము పడడంతో కొద్దిసేపు వాహనాలను పక్కకు నిలుపుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు కనిపించకపోవడంతో కిందపడిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇటుకల బట్టీని ప్రధాన రహదారికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొలాలకు భూసారమే కీలకం

- భూమి సారవంతమైతేనే అధిక దిగుబడులు
- చెరువులు, కుంటల మట్టిని పొలాల్లో చల్లాలి
- వేసవికాలమే మంచి సీజన్

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంట సాగులో ప్రధాన భూమిక పోషించేది భూసారమే. భూమి సారవంతమైతేనే పంట దిగుబడి అధికంగా వస్తోంది. రైతులు వేసిన ఎరువులు పంటకు చేరి దిగుబడితో పాటు పంటలో నాణ్యత కూడా పెరుగుతుంది. అలాగే భూమిలో సారం తగ్గితే సాగు చేసిన పంటకు తెగుళ్ల, పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటిని అధిగమించడానికి రైతుకు ప్రత్యేకమార్గం



చెరువుమట్టిని ట్రాక్టర్‌తో పొలంలో వేస్తున్న దృశ్యం

చెరువులు, కుంటల్లో నిలువ ఉన్న మట్టిని తీసుకువచ్చి తమ పొలాలలో చల్లుకోవడం. ఈ విధానం రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

ఇదే మంచి సమయం: చెరువుల్లోని మట్టిని రైతులు తమ పొలాల్లో వేసుకునేందుకు వేసవికాలం మంచి సమయం. ఎండాకాలంలో చెరువులు, కుంటలు నీరులేక ఎండిపోయి ఉంటాయి. రైతులు కూడా తమ పొలాల్లో ఇప్పటివరకు పంటలు సాగు చేయగా ప్రస్తుతం ఖాళీగా ఉంటాయి.

భూసారం పెంపు ఇలా... చెరువు పూడిక మట్టితో భూమి నాణ్యత, తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది. నీటి వినియోగ సామర్థ్యంతో పాటు భూమిలోని సారం పెరగడానికి ఉపయోగపడుతుంది. మట్టి పీహెచ్ శాతం తగ్గి సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలు, పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశాం ఉంటుంది. సేంద్రియ కర్బణం ఎక్కువగా ఉంటే మినరైజేషన్ పెరిగి మొక్కల పెరుగుదల ఉంటుంది.

చెరువుమట్టిలో ఉండే పోషకాలు.. ఒక్క కిలో చెరువు మట్టిలో నత్రజని 720 మిల్లీగ్రాములు ఉంటుంది. అలాగే భాస్వరం 35 మిగ్రా, పొటాష్ 310, మిగ్రా, కర్బనం 0.5 మి.గ్రా, జింక్ 1.8 మి.గ్రా, బోరాన్, 0.8 మి.గ్రా, గంధకం 18 మిగ్రా, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు సాంద్రత 308 మిగ్రా ఉంటుంది.

పండ్ల తోటలకు ఎంతో మేలు: చెరువు మట్టి పండ్ల తోటలకు ఎంతో మేలు చేస్తుంది. దిగుబడి పెరగడమే గాక నాణ్యమైన పండ్ల దిగుబడి వస్తుంది. మామిడి, జామ, బత్తాయి. వంటి పండ్ల తోటల్లో చెరువు మట్టి వాడటంతో వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతాయి. దీనితో భూమిలో తేమను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. పొదుల్లో చెరువు మట్టి మల్చింగ్ మాదిరిగా ఉపయోగపడుతుంది.



పొలంలో కుప్పలుగా వేసుకున్న చెరువు మట్టి

కూరగాయల సాగులో.. టమోటా, బెండ, వంకాయ తదితర పంటలు సాగులో అధిక దిగుబడుల కోసం ఎరువులు వాడకం ఎక్కువగా ఉంటుంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. కూరగాయలు సాగు చేసే పొలాల్లో ఎకరానికి 8 నుంచి 10 ట్రాక్టర్ చెరువు మట్టిని ఆఖరి దుక్కిలో వేసుకొని కలియదున్నితే మంచి నాణ్యతగల పంట పండుతుంది. పెట్టబడి కూడా తగ్గుతుంది. అంతే కాకుండా భూమిలో తేమ శాతం తగ్గకుండా ఉంటుంది. ప్రతి రైతు ప్రస్తుతం సీజన్‌లో తమ పొలాలకు చెరువు మట్టిని వేసుకునేందుకు ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది.

రైతులకు ఎంతో ఉపయోగం



ప్రస్తుతం ఎండాకాలం కావడంతో చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండవు. అక్కడి మట్టిని తీసుకొచ్చి పొలాల్లో చల్లుకుంటే భూమి సారవంతమవుతుంది. పంటలు సాగు చేసుకుంటే దిగుబడి బాగా వస్తుంది. సాగుచేసే పొలాల్లో చెరువు మట్టిని వేసుకొని కలియదున్నితే మంచి ఫలితాలు ఉంటాయి.

- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్

మంత్రాలయం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆరోగ్య సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. టీబీ, కుష్టు రోగుల రిజిస్టర్లను పరిశీలించి నమోదు విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వే ప్రమాణాలు తప్పుల తడకగా కాకుండా పూర్తి చేయాలని సూచించారు. సర్వే నిబంధనలు, సంబంధించిన సలహాలు, సూచనలు, జాగ్రత్తలు వివరించారు. ఈ పరిశీలనలో మండల వైద్యాధికారి గోవిందమ్మ, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్‌ఎన్ రాణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



రిటైర్డు అయిన ఉపాధ్యాయ దంపతులకు చిత్రపటాన్ని ఇస్తున్న టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, ఎంఈవోలు

మంత్రాలయం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరులు, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్న అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం ఉన్నత పాఠశాలలో ఈనెల 30న పదవీ విరమణ పొందుతున్న ఇంగ్లీషు ఉపాధ్యాయులు రామాంజనేయులుకు హెచ్‌ఎం బోజరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులను గాక గ్రామాలను సైతం మార్చగలిగే శక్తి వారికే ఉందన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినప్పుడే ప్రజా మన్ననలు పొందుతారని కొనియాడారు. అనంతరం జ్ఞాపికలు అందజేసి శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామ్మోహన్, రామలింగప్ప, వెంకటేశ్వరరెడ్డి, నీటకంట స్వామి, జగదీష్, రాజశేఖర్, యుగంధర్, తారాదేవి, నాగరాజు, సంయుక్త రాణి, కుముద్వతి, వీకేఆర్ నాయక్, సుభాష్, కస్తూరి, కల్పలత, ఈరమ్మ, కృపానందం, ఎర్రన్న, సీఆర్‌పీలు బంగారప్ప, కేశన్న, స్కూల్ కమిటీ చైర్మన్ ఆంజనేయ, నాగరాజు పాల్గొన్నారు.

రైతులకు పెద్దపీట

- సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి
- అన్నదాతను ముంచిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి
- రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ

కోసిగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మిగనూరు, ఆదోని అగ్రికల్చర్ ఏడీలు మహ్మద్ ఖాద్రి, బాలవర్ధిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాలకు సంబంధించి రూ.43.29లక్షల విలువైన యంత్ర పరికరాలను అందిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని అన్నారు. రైతులను వైసీపీ ప్రభుత్వం నిండా ముంచేసిందన్నారు. కోసిగి మండలానికి రూ.18.70 లక్షలు, కౌతాళానికి రూ.12.28లక్షలు పెద్దకడుబూరుకు రూ.9.38 లక్షలు, మంత్రాలయానికి రూ.10.41లక్షలు యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మే నెలలో అన్నదాత సుఖీభవ కింద భూమి ఉన్న ప్రతి రైతుకు రూ.20వేలు రైతులకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, వెంకటపతిరాజు, కురువ వీరేష్, విష్ణువర్దన్ రెడ్డి, బీజేపీ రాముడు, జ్ఞానేష్, రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, నాడిగేని చిన్న తాయన్న, మాలపల్లి వెంకటేశ్, ఈరెడ్డి, ఎస్ఐ హనుమంతరెడ్డి, అగ్రికల్చర్ ఏవోలు రాజు, శేషాద్రి, వరప్రసాద్, గణేష్ ఉన్నారు.



రైతులకు రాయితీ పై పవర్ గ్రిడ్‌ను అందజేస్తున్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ బాధితులకు వరం

సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు ఒక వరం లాంటిదని రాఘవేంద్ర రెడ్డి అన్నారు. కోసిగిలో కౌతాళం మండలం కుంటనహాల్‌కి చెందిన ముల్ల సమీరా బేగంకు రూ.75వేలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

ప్రశాంత జీవనం సాగించాలి: సీఐ

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం రాత్రి పెద్దనేలటూరులో పోలీసులు 'పల్లెనిద్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ మాట్లాడుతూ భూసమస్యలతోనే గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవా లని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆస్తిపన్ను చెల్లింపుదారులకు సైబర్ నేరగాళ్ల వల

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు తాము మున్సిపల్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతూ కొంతమంది సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తున్నారు. రెండు మూడు రోజుల క్రితం పట్టణంలోని ఇరువురు హోటల్ యజమానులకు సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మున్సిపాలిటికి ఆస్తిపన్ను చెల్లించాలని బకాయి ఉందని వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆన్‌లైన్‌లో కేసు నమోదు అవుతుందని చెప్పి భయపెడుతున్నారు. వెంటనే ఫోన్ చేసిన నంబర్‌కు ఫోన్‌పే చేసి స్కీన్ షాట్ తీసి పెట్టాలని చెబుతున్నారు. దీంతో కొంతమంది నమ్మి సైబర్ నేరగాళ్ల ఫోన్‌లకు ఫోన్ పే చేస్తూ మోసపోతున్నారు. మరి కొంతమంది తేరుకొని తమకు వచ్చిన నంబర్ ఎవరిది.. నిజముగా మున్సిపల్ అధికారులు ఫోన్ చేశారా అని పరిశీలించుకుని సైబర్ నేరగాళ్ల ఉచ్చునుంచి బయట పడుతున్నారు. మార్చి నెలకు ముందు ఇలాగే సైబర్ నేరగాళ్లు ఆస్తిపన్ను చెల్లింపు దారులకు ఫోన్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వెంటనే ఇలాంటి ఫోన్లను నమ్మొద్దని ప్రకటనలు ఇచ్చారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- చాకచక్యంగా నిలిపివేసిన డ్రైవర్
- తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సు బానెట్ నుంచి వస్తున్న పొగలు

గోనెగండ్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులోని బానెట్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీన్ని గమనించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేసి ప్రమాదం నుంచి తప్పించాడు. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు బయలు దేరింది. బస్సులో ప్రయాణికుల రద్దు ఎక్కువగా ఉంది. గోనెగండ్ల గ్రామ శివార్ల దగ్గరకు రాగానే డ్రైవర్ పక్కనే ఉన్న ఇంజన్ బానెట్ నుంచి పెద్దగా పొగలు వచ్చి బస్సును కమ్మేశాయి. డ్రైవర్ బస్సును ఆపివేశాడు. ప్రయాణికులు భయంతో కేకలు వేస్తూ బస్సు దిగి పరుగులుపెట్టారు. కొంతసేపటికి బస్సులోని పొగలు నిలిచి పోయాయి. బస్సు కండెక్టర్ ప్రయాణికులను వేరే బస్సుకు ఎక్కించారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

ఆటోల అడ్డాగా ఆర్టీసీ బస్టాండ్

బస్సులు లోపలికి వచ్చేదెలా?



కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌లో అడ్డంగా ఉన్న ఆటోలు

కోసిగి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆటోలకు అడ్డాగా మారింది. బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేందుకు కూడా ఇబ్బందిగా మారిందని ఆర్టీసీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండు మొత్తం ప్యాసింజర్ ఆటోలు, ప్రైవేటు వాహనాలు, పార్కింగ్ స్థలంగా మార్చేసుకోవడంతో ఎమ్మిగనూరు-ఆదోని ఆర్టీసీ డిపోల బస్సులు బస్టాండులోకి రావడానికి కటింగ్ వద్ద స్థలం లేక బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కోసిగి ఆర్టీసీ బస్టాండులో కంట్రోలర్‌ను ఏర్పాటుచేసి ఆటోలు, ప్రైవేటు వాహనాలను బస్టాండులో నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు. బస్టాండులో ఆర్టీసీ అధికారులు ఎవరూ కూడా లేకపోవడంతోనే ఇష్టానుసారంగా ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, ఆటోలు పెత్తనం చేస్తున్నారనీ, డ్రైవర్లనే బెదిరింపులకు దిగుతున్నారని ఆర్టీసీ డ్రైవర్లు వాపోయారు.

తరగతి గదుల బదిలీపై దుమారం

- ఎంఈవోపై ప్రజాప్రతినిధులు, అధికారుల ఆగ్రహం
- జీతాలు అందకపోవడంతో ధర్నా చేస్తామన్న ఎంపీటీసీలు
- ప్రజల దాహం తీర్చేందుకు చర్యలు చేపట్టాలి: ఎంపీపీ
- గంటన్నర లోపే ముగిసిన సర్వసభ్య సమావేశం

మంత్రాలయం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్ర నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతి గదులను సంతమార్కెట్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేయడంపై మండల సర్వసభ్య సమావేశంలో దుమారం రేపింది. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గిరిజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో రాధ, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి నిర్వహించారు. ఎంఈవో-1 మైనుద్దీన్‌పై ఎంఈవో-2 రాఘవేంద్ర, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మంత్రాలయం ఎంపీటీసీలు వెంకటేశశెట్టి, మేకల వెంకటేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే, ఎంపీపీ, పాఠశాల పంచాయతీ తీర్మానాలు లేకుండా ఎలా తరగతులను చేర్పిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాల తరగతులను బదిలీ చేస్తే ఎంఈవో దిష్టిబొమ్మను రాఘవేంద్ర సర్కిల్‌లో గ్రామంతా కలిసి దహనం చేస్తామని హెచ్చరించారు. ఇందులో విద్య, వైద్యం, పశువైద్యం, గృహ నిర్మాణం, తాగునీరు, రెవెన్యూ ఉపాధి, సెల్ఫ్ హెల్త్ గ్రూప్స్, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ రోడ్లు, పరిశుభ్రత విద్యుత్ వంటి అంశాలపై చర్చించారు. 12 గంటలకు ప్రారంభమైన మండల సర్వసభ్య సమావేశం గంటన్నర లోపే ముగించారు. తమ శాఖకు సంబంధించిన సమావేశాన్ని సభలో చర్చించి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలతోనే సమావేశం ముగించారు. మాధవరం ఎంపీటీసీ ఈరన్న మాట్లాడుతూ రెండేళ్లుగా ఎంపీటీసీలకు జీతాలు ఇవ్వడం లేదని, జీతాలివ్వకపోతే ఎంపీటీసీలంతా ధర్నా, నిరసన చేస్తామని తెలిపారు. వెంటనే జీతాలు మంజూరు చేయాలని కోరారు. పల్లె పండుగలో భాగంగా రూ.2.50 కోట్లతో వేసిన పంచాయతీరాజ్ రోడ్లకు ఇంత వరకు బిల్లులు రాలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతగా రూ.1.30 కోట్లు రోడ్లకు మంజూరైందని ఏఈ మల్లయ్య తెలిపారు. ఎంపీపీ గిరిజమ్మ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏ ఒక్క గ్రామానికి నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. జడ్పీ నిధుల కింద రచ్చుమర్రికి రూ.8.50 లక్షలు, ఖగ్గల్లు రూ.8.50 లక్షలు, రచ్చుమర్రి సీసీ రోడ్లకు రూ.15 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కొంతమంది అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో తూతూ మంత్రంగా తాము నివేదిక తెచ్చిన సమాచారాన్ని చదివి అధికారులు వెళ్లిపోవ డంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, వ్యవసాయ కమిటి చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి, ఏఈలు మల్లయ్య, వెంకట్రాముడు, ఏపీవో భక్తవత్సల, ఏపీఎం రాజశేఖర్, సర్పంచులు ముకురన్న, ఎంపీటీసీలు రామాంజనేయులు, చిన్నన్న, గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, ఇస్రత్ బాషా, స్వామినాథన్, మహేష్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోపై మండిపడుతున్న ప్రజాప్రతినిధులు